సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 2 । జూన్ । 2024



విత్తన దుకాణాల్లో తనిఖీలు

పెద్దపల్లిరూరల్: శాంతినగర్‌లోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఏవో అలివేణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన వివరాలను నోటీసు బోర్డుపై రాసిఉంచాలని సూచించారు.



హనుమాన్ ఆలయంలో పూజలు

గోదావరిఖనిటౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు శనివారం మార్కండేయకాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం 42.7/35.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

స్వయం పాలన.. సాధికారత

- తెలంగాణ రాష్ట్రం అవతరించి నేటితో పదేళ్లు
- రైతుల ఖాతాల్లో రూ.1,646.38కోట్ల 'రైతుబంధు' జమ
- జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు
- పేదలకు చేరువైన కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం
- పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన ప్రజాపాలన





సాక్షి, పెద్దపల్లి: తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఆదివారంతో పదేళ్లు పూర్తవుతోంది. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగ ఫలంతో రాష్ట్రం ఏర్పడింది. కొత్తగా ఆవిర్భవించిన జిల్లాలో కొన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. మరికొన్ని అంశాల్లో ప్రగతి వేగం పుంజుకోవాల్సి ఉంది. స్వయం పాలనలో జిల్లా అన్నిరంగాల్లో సాధికారత సాధించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో గతంలో కంటే గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హాజరై పతాకావిష్కరణ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రజల చెంతకే పాలన

- పదేళ్లలో భౌగోళికంగా, సామాజికంగా, పరిపాలన పరంగా, ఆర్థికంగానూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.
- కొత్త జిల్లా ఏర్పాటుతో పెద్దపల్లి ప్రజల చిరకాల కోరిక నెరవేరగా, కొత్తగా పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలుగా, 65 కొత్త గ్రామ పంచాయతీలుగా, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి మండలాలుగా ఏర్పాటయ్యాయి.
- పరిపాలన సౌలభ్యం కోసం రూ.48కోట్లతో కలెక్టరేట్, రూ.38.50కోట్లతో రామగుండం కమిషనరేట్ నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.
- చిన్నపల్లెలు గ్రామపంచాయతీలుగా మారడంతో స్వయం పాలనకు అడుగులు పడ్డాయి.
- సొంతంగా జిల్లా పరిషత్ ఏర్పాటు చేసుకొని స్వయం పాలన సాగిస్తున్నాం.
- కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లు, సీపీ, డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాలన ప్రజలకు మరింత చేరువైంది.
- అధికారిక పనులు, నిర్ణయాల్లో జాప్యం తగ్గింది.

వ్యవసాయరంగానికి పెద్దపీట

గత ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక నిర్ణయాలతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ తదితర పథకాల ద్వారా రైతుల సంక్షేమానికి పాటుపడింది. 2018 వానాకాలం నుంచి ఇప్పటివరకు సుమారు 1,46,819మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,646.38కోట్లు జమచేసింది. రైతుబీమా ద్వారా 2,322 మంది రైతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.116.1కోట్లు చెల్లించింది.

కాళేశ్వరం.. ఎస్సారెస్పీ స్థిరీకరణ

- సాగు, తాగు, పారిశ్రామిక నీటి అవసరాలు తీర్చేందుకు రూ.80,500కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన అన్నారం సరస్వతీ, సుందిళ్ల పార్వతీ బ్యారేజీలు నిర్మించారు. వాటి ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసిన నీటని గ్రావిటీ ద్వారా జంట సొరంగాల్లోంచి నంది పంపుహౌస్‌లోకి, అక్కడి నుంచి గాయత్రీ పంప్‌హౌస్‌లో ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. అక్కడి నుంచి ఎస్సారెస్పీ వరదకాల్వలోకి లిఫ్ట్‌చేసి మధ్యమానేరు ప్రాజెక్టు ఆయకట్టును స్థిరీకరించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు పంటలకు నీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో జిల్లాలో చివరి ఆయకట్టుకు నీరందక ఎండిపోయే పంట పొలాలకు సాగునీటి సమస్య తీరింది. సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

పట్టణాల్లో మౌలిక సదుపాయాల మెరుగు..

- కొత్త మున్సిపాలిటీల్లో పట్టణప్రగతి నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర నిధులతో అనేక మౌలిక వసతులు కల్పించారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌లు, ఓపెన్ జిమ్‌లు, పల్లె ప్రకృతివనాలు, కూడళ్ల సుందరీకరణ, రామగుండం కార్పొరేషన్‌లో రూ.3.80కోట్లతో ఎఫ్ఎస్‌టీపీలు నిర్మించారు.

సింగరేణిలో అనేక మార్పులు..

- సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా రిటైర్డ్ కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టారు. రూ.10 లక్షల వరకు సొంతింటి నిర్మాణం కోసం వడ్డీలేని రుణం, ప్రత్యేక ఇంక్రిమెంట్ మంజూరు, 4,600 మంది ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కల్పన, పెండింగ్ డిపెండెంట్‌లకు వన్‌టైం సెటిల్మెంట్ కింద ఉద్యోగాలు, సకలజనుల సమ్మెలో పాల్గొన్న కార్మికుల వేతనాలు చెల్లించారు. దీంతో కార్మికుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





మెరుగైన రవాణా వ్యవస్థ..

- జిల్లాలో నుంచి వెళ్తున్న రాజీవ్ రహదారికి తోడుగా నాగ్‌పూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే(ఎన్‌హెచ్–163)లో భాగంగా నిర్మించే నాలుగు వరుసల రహదారి జిల్లాలో 37.96కి.మీ. పొడవున ఉంది. జిల్లాలో 185కి.మీ. మేర సింగిల్‌లైన్ రోడ్లను రూ.244.78కోట్లతో డబుల్ రోడ్లుగా విస్తరించారు. అలాగే రూ.133.10కోట్లతో 13వంతెనలు, రూ.130.46కోట్లతో పలు రహదారులు అభివృద్ధి పూర్తిచేశారు. రూ.119కోట్లతో కూనారాం ఆర్వోబీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.



వేడుకలకు ముస్తాబైన అబ్దుల్ కలాం స్టేడియం



సుందిళ్ల బ్యారేజీ

మెడికల్ కాలేజీ.. మాతాశిశు సంరక్షణ కేంద్రాలు

- జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావటంతోపాటు, కొత్తగా రామగుండంలో సింగరేణి సహకారంతో రూ.500కోట్లతో మెడికల్ కాలేజీ ప్రారంభమైంది.
- పెద్దపల్లి, మంథనిలో మాతా శిశుసంరక్షణ కేంద్రాల ఏర్పాటుతో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.
- 134 రకాల వైద్య పరీక్షల కోసం రూ.2కోట్లతో డయాగ్నస్టిక్ హబ్ ప్రారంభించారు.
- పెద్దపల్లి, రామగుండంలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రాలు, పెద్దపల్లిలో ఆరు పడకల పాలియేటివ్ కేంద్రం, రామగుండంలో 15పడకల న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రారంభించారు.



న్యూస్‌రీల్

అంజన్నకు మొక్కులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఎమ్మెల్యేకు ఆలయసిబ్బంది సాదరస్వాగతం పలికారు.

సబ్ రిజిస్ట్రార్ భవనానికి ఆధునిక హంగులు



శరవేగంగా సాగుతున్న పునరుద్ధరణ పనులు

రామగుండం: స్థానిక రైల్వే భూగర్భ వంతెన సమీప ఎంపీడీవో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూపుదిద్దుకుంటోంది. ఇందులోని నిరుపయోగంగా ఉన్న మహిళా సమాఖ్య భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. 2023 మార్చి 25న ప్రభుత్వం ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కార్యాలయ నిర్వహణకు అవసరమైన పనులు, ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభిస్తారని తెలిసింది.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



సన్మానిస్తున్న బల్దియా కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ(రామగుండం): పారిశుధ్య వృత్తిని స్వీకరించి పనిచేయడం గొప్ప విషయమని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా సుదీర్ఘ కాలం పనిచేసి పదవీ విరమణ పొందిన పర్వ బతుకమ్మ, రాసకట్ల వెంకటమ్మను శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సన్మానించారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, కార్మిక సంఘాల నాయకులు యాకయ్య, మురళీధర్‌రావు, మంథని లింగయ్య, వేల్పుల రాయమల్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్టు సుచరిత

ధర్మారం(ధర్మపురి): బాల్యవివాహాలను అరికట్టడంలో అందరూ కృషి చేయాలని జెండర్ స్పెషలిస్ట్ సుచరిత కోరారు. మల్లాపూర్‌లో ఉపాధిహామీ మహిళలకు శనివారం మహిళా సాధికారిత ఆధ్వర్యంలో తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన కల్పించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్ర విద్యార్థులతో మొక్కలు నాటించారు. సుచరిత మాట్లాడుతూ, ఆడపిల్లలపై వివక్ష చూపవద్దన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బ్లాండీనా, పంచాయతీ కార్యదర్శి మహేశ్, అంగన్‌వాడీ టీచర్‌లు సుజాత, విజయనిర్మల, ఏఎన్‌ఎం సుజాత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తనాలు పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

మంథని: డీలర్లు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ విత్తన దుకాణాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి విత్తన స్టాక్ పరిశీలించారు. ఒకేబ్రాండ్ విత్తనాలను డీలర్లు బ్లాక్‌చేస్తే చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. రైతులు ఒకేబ్రాండ్ విత్తనాలు వాడరాదని సూచించారు. అన్ని బీజీ-2 హైబ్రిడ్ విత్తనాలు ఒకే దిగుబడి ఇస్తాయని, పంటల యాజమాన్యం పాటించాలని సూచించారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగిరి(మంథని): పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సెంటనరీకాలనీ జేఎన్టీయూలోని కౌంటింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అరుణశ్రీలతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లు తనిఖీ చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక ప్రవేశం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు హనుమా నాయక్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'నాలా' ఆక్రమణలు తొలగించాలి

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి అధికారులతో సమీక్షించారు. నాలాల ఆక్రమణలను గుర్తించి తొలగించాలన్నారు. వర్షపు నీటికోసం ఇంకుడుగుంతలను నిర్మించాలని అన్నారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మికంగా తనిఖీలు చేసి, నాణ్యతాప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీపీవో ఆశాలత, డీఆర్డీవో రవీందర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాల నమోదు ప్రక్రియ గురించి ఆపరేటర్లతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతీసెగ్మెంట్‌లో 14టేబుళ్ల వివరాలు నమోదు చేసేందుకు నలుగురు ఆపరేటర్లను నియమిస్తామన్నారు. ప్రతీ రౌండ్ కౌంటింగ్ ఫలితాలు ఆపరేటర్లే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

జిల్లాలో విత్తన కొరత లేదు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ

పెద్దపల్లిరూరల్: 'జిల్లాలో అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. సందేహాల నివృత్తి కోసం కాల్‌సెంటర్ 95739 51060 నంబరుకు ఫోన్ చేయాలి' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సాగుకు అవసరమైన అన్నిరకాల విత్తనాలు జిల్లాలోని 14మండలాల్లో 353మంది డీలర్ల వద్ద నిల్వ ఉంచేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 2.77లక్షల ఎకరాల సాగు భూమి

జిల్లాలో 2,77,720 ఎకరాల సాగుభూమి 1,55,496 మంది రైతుల అధీనంలో ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 2,08,000 ఎకరాల్లో వరి, 60వేల ఎకరాల్లో పత్తి, 12వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయన్నారు. భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నకిలీ, కల్తీపై పటిష్ట నిఘా

రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలని, నకిలీ, కల్తీ విత్తనాలు అంటగడితే కఠినంగా వ్యవహరిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. రైతులు విత్తన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, కచ్చితంగా రశీదు తీసుకోవాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కల్తీ విత్తనాలు రాకుండా నియంత్రించేందుకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశాలు

గోదావరిఖని: రెండు రోజులపాటు స్థానిక సింగరేణి ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సమావేశాలు శనివారం ముగిశాయి. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు చేశారు. ప్రధానంగా సింగరేణి మనుగడ కోసం కొత్తగనులు ఏర్పాటు చేయాలని, యూనియన్ గుర్తింపు సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఆర్ఎల్‌సీ, సింగరేణి జాప్యం చేస్తున్నాయని, డిపెండెంట్ల వయసు 35 40ఏళ్లకు పెంచాలని, అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన కార్మికులకు సర్ఫేస్‌లో సేమ్ జాబ్‌ఇవ్వాలని, కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, నిర్మాణానికి వడ్డీలేని రుణం అందించాలని తీర్మానించినట్లు ప్రతినిధులు వెల్లడించారు. ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కేసులు



నకిలీ పత్తి విత్తనాలతో పోలీసులు

గోదావరిఖని: రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలను విక్రయించినా, సరఫరా చేసినా పీడీయాక్ట్ అమలు చేస్తామన్నారు. కల్తీ, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు, రైతుకు అండగా నిలవడమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం బొప్పారం గ్రామంలో కర్ణకొండ చంద్రశేఖర్ ఇంటి ఆవరణలో నిషేధిత బీటీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.15లక్షల విలువైన ఐదు క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని తెలిపారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన కర్ణకొండ చంద్రశేఖర్, బెల్లంపల్లి మండలం చాకెపల్లికి చెందిన సూరం దిలీప్, కాసిపేటకు చెందిన కల్లూరి వెంకటేశంను అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. సమావేశంలో అడ్మిన్ డీసీపీ రాజు, పోలీసు అధికారులు రవికుమార్, అఫ్జలుద్దీన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణిలో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ఆర్జీ–1 ఏరియాలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. జీఎం శ్రీనివాస్ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. జీఎం వెంట అధికారులు రాంమోహన్, లక్ష్మీనారాయణ, కిరణ్‌బాబు, వరప్రసాద్, ప్రభాకర్, జితేందర్, సారంగపాణి ఉన్నారు. ఆర్జీ–2 అబ్దుల్‌కలాం స్టేడియంలో ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు జీఎం సూర్యనారాయణ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: సత్వర న్యాయం కోసం ఈనెల 8న చేపట్టే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం అదనపు జిల్లా న్యాయస్థానంలో జరిగిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీకి వీలైన కేసులు, ప్రమాద బీమా, చెక్కుల బౌన్స్, ఇతర సివిల్, క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల, రెండో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ, ఏపీపీలు కంది రవీందర్, నహీదా ఫర్హాన్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, అజయ్‌బాబు, రవీందర్, ఎస్సైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేద్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
రక్తనాళాల వ్యాధులు : రక్తప్రసరణ ఆగిపోవుట, పాదములు నల్లబడుట, రక్త నాళికములు చిట్లి పోవుట, కాళ్ళ నరాలు ఉబ్బడం, రక్త నాళాల పునరుద్ధరణ	డా॥ దేవేందర్ సింగ్ MS, DNB (Vascular), FIVS (UK)	02-06-2024 ఆదివారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ మనోజ్ చక్రవర్తి MS (Ortho), M.Ch (Ortho)	
కిడ్నీ వ్యాధులు: మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ మహేష్ కోట	03-06-2024 సోమవారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
వెన్నెముక వ్యాధులకు కన్సల్టేషన్: నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు చేతులు తిమ్మిర్లు, నరం ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స (స్కోలియోసిస్ సర్జరీ), వెన్నెముక ఇన్‌ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ కిరణ్ కుమార్ లింగుట్ల MBBS, D Ortho, MRCS (Edinburgh-UK), FRCS Ed (Tr & Ortho), Mch Ortho UK, SOA Sr. Spine Fellowship UHW, Cardiff, UK	04-06-2024 మంగళవారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
గ్యాస్ట్రో వ్యాధులు : ప్యాంక్రియాస్, లివర్, కడుపు మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధులు	డా॥ ఎం.ఎస్. పవన్ కుమార్ MS, M.Ch (AIIMS), FLT (Seoul)	
బ్లడ్ క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులకు కన్సల్టేషన్: ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లుకేమియా, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్	డా॥ శ్వేత ప్రజ్ఞ. జి MD, DM (AIIMS)	
న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజి వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్ అవ్వడం, కాళ్ళల్లో రక్తనాళాలు మెలిక పడటం, కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినపుడు రక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్ అవ్వడం	డా॥ శ్రీహరీష్ వంకాయలపాటి MBBS, DNB, DM (Neuro & Interventional Radiology) MNAMS, EDIR (European diploma in radiology)	05-06-2024 1వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ అమిత్ రెడ్డి పి MBBS, PGD (Orthopaedics), DNB (Orthopaedic Surgery), MNAMS (Orthopaedic Surgery)	
కండరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అన్నిరకముల ఎముకల వ్యాధులు	డా॥ వి. రాజేంద్ర వరప్రసాద్ MD, DM Rheumatology, APLAR Fellow, Former Associate Professor in Rheumatology, NIMS	06-06-2024 గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
గ్యాస్ట్రో వ్యాధులు : జీర్ణకోశ, చిన్నపేగు, అబ్డామినల్ క్యాన్సర్ మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధుల	డా॥ కిరణ్ పెద్ది	
కిడ్నీ వ్యాధులు : కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు	డా॥ అరుణ్ కుమార్ పొన్న MD, DM Nephrology (Osm) Fellowship in Clinical (Dialysis, Transplant) & Critical Care Nephrology	07-06-2024 శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
క్యాన్సర్, హెమటాలజీ వ్యాధులు : అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	డా॥ రాజేష్ పొల్లం MBBS (Gold Medalist), DNB (General Medicine) DM (Medical Oncology) (TMH)	
మెదడు, వెన్నెముక మరియు నరాల వ్యాధులకు: మెదడులో గడ్డలు, రక్త స్రావం, చీము గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్ మరియు ఫిట్స్ వ్యాధులకు, వెన్నుపాము గడ్డలు, డిస్క్ సమస్యలు, ఫ్రాక్చర్ మరియు క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు	డా॥ కె.ఎస్. కిరణ్ MS (Gen Surgery), M.Ch (Neurosurgery) (OSM) Ex Assistant Professor, NIMS	

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సత్యానారాయణ తెలి పారు. మృతుడి వయసు 30 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. గుర్తుపట్టిన వారు 87126 56508 నంబర్‌కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరారు. వడదెబ్బతోనే మరణించి ఉంటాడని స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



వినోద (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన లక్కాకుల వినోద(54) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వినోద కొంత కాలంగా తలనొప్పితో బాధ పడుతోంది. ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి చెంది, గత నెల 25న ఇంట్లో క్రిమిసంహార మందు తాగింది. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొంతుపల్లి వాసి..

- గత నెల 25న ఆత్మహత్యాయత్నం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లికి చెందిన చదువు వాసుదేవరెడ్డి (58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వాసుదేవరెడ్డికి, బొంతుపల్లికే చెందిన చదువు నరసింహారెడ్డి మధ్య గొడవ లున్నాయి. నరసింహారెడ్డితోపాటు కోరుకంటి శారద, కోరుకంటి ఓదెలు, జునూతుల మనోహర్‌రెడ్డి , జునూతుల మంజుల, కోరుకంటి శంకర్ అతన్ని ఇబ్బందులకు గురిచేయాలనుకున్నారు. శారదకు రూ.5 లక్షలతోపాటు 20 గుంటల భూమి ఇవ్వాలని వాసుదేవరెడ్డితో బలవంతంగా కాగితం రాయించారు. తర్వాత డబ్బులు, భూమి కోసం మానసికంగా వేధించారు. దీంతో మనస్తాపం చెందిన అతను గత నెల 25న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు వినయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

స్వరాష్ట్ర కాంక్షను రగిల్చిన గీతం

- 'జయ జయహే తెలంగాణ'కు కొత్త వెర్షన్
- స్వాగతించిన సాహితీవేత్తలు
- రాష్ట్ర గీతంగా ఆమోదించిన ప్రభుత్వం
- నేడు ప్రజల ముందుకు..

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర సాధన విజయ గీతిక అయిన జయ జయహే తెలంగాణ అనే పాటను గీత రచయిత అందెశ్రీ రాశారు. ఉద్యమ సమయంలో ఊరువాడా ఏకమై, రాష్ట్ర కాంక్షను ఎలుగెత్తి చాటాయి. ఉద్యమకారుల్లో ఈ పాట నూతన ఉత్సాహాన్ని నింపి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, అందరినీ సంఘటితం చేసింది. 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో మనకంటూ ఓ పాట ఉండకూడదా అనే ఆలోచన అందెశ్రీకి వచ్చింది. ఆ వెంటనే నాలుగు చరణాలు రాశారు. తర్వాత అదే సంవత్సరం నవంబర్ 11న ఆదిలాబాద్‌లో జరిగిన తెలంగాణ రచయితల వేదిక జెండా వందనంలో వాటిని ఆలపించారు. తెలంగాణ ఘన కీర్తిని ఈ పాటలో పొందుపరచగా 12 చరణాలతో ఉద్యమకారుల నోట చేరి, తెలంగాణ ప్రజల నరనరాన స్వరాష్ట్ర ఆకాంక్షను నింపింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామని నాయకులు, ఉద్యమ నేతలు పలు వేదికలపై చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించలేదన్న విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ 2021 మార్చి 16న అసెంబ్లీ సమావేశంలో స్పష్టం చేశారు.

రాష్ట్రం వచ్చిన పదేళ్లకు..

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించగా మిత్రపక్షాలు ఆమోదం తెలిపాయి. పాట కొత్త వెర్షన్‌ను సాహితీవేత్తలు స్వాగతించారు. రికార్డింగ్ పూర్తవగా ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని, ప్రజల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు తమ మనోభావాలను వెల్లడించారు.

మహత్తర గీతం



రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహత్తర గీతం జయ జయహే తెలంగాణ. పదేళ్లుగా ప్రజల్లోకి రాకుండా బంధించబడింది. ఇప్పుడు అధికారికంగా ప్రకటించడం అ అభినందనీయం. కీరవాణి తెలంగాణేతరుడు అని చెప్పడానికి ఇది తెలంగాణ ఉద్యమ సందర్భం కాదు. రాష్ట్రం వచ్చింది. కీరవాణి స్వర కల్పన చేయడంలో అభ్యంతరం లేదు.

– అన్నవరం దేవేందర్, కవి, రచయిత, భగత్‌నగర్, కరీంనగర్

ఉద్యమానికి ఊపిరినిచ్చింది



కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చింది. ప్రజల్లో స్వరాష్ట్ర కాంక్షను రగిల్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన వైపు అడుగులు వేయించింది. మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. రాష్ట్ర గీతంగా ప్రజల మనోభీష్టానికి ఇచ్చిన గౌరవమిది. చాలా సంతోషంగా ఉంది.

– కొత్త అనిల్‌కుమార్, కవి, జ్యోతినగర్, కరీంనగర్

నిడివి తగ్గించాలి



రాష్ట్ర గీతం నిడివి తగ్గించాలి. ఇందులో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఔన్నత్యాన్ని చాటే చరణాలు ఉంటే సరిపోతుంది. పాఠశాలల్లో, సభల్లో గానం చేయడానికి యోగ్యంగా ఉండాలి. నేటి తరానికే కాకుండా భావితరాలకు స్ఫూర్తినిచ్చే అంశాలకు చోటివ్వాలి.

– దాస్యం సేనాధిపతి, కవి, రచయిత, విమర్శకుడు, కరీంనగర్

సంస్కృతికి అద్దం పడుతుంది



అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం మన గొప్పదనం, సంస్కృతికి అద్దం పడుతుంది. పండితులు, పామరులను సైతం పరవశింపజేసిన ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి, ప్రజల్లోకి తీసుకురావడం అందరూ హర్షించాల్సిన విషయం.

– వేములవాడ ద్రోణాచారి, కవి, రచయిత, రాఘవేంద్ర నగర్, కరీంనగర్

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది



జయ జయహే తెలంగాణ గీతం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది. ప్రజాకవి అందెశ్రీ తెలంగాణ ఘనతను చాటుతూ దీన్ని రాశారు. ఉద్యమ నేతలు గుర్తించకున్నా పదేళ్ల తర్వాత అయినా కొత్త ప్రభుత్వం గుర్తించి, రాష్ట్ర గీతంగా ప్రకటించడం అభినందనీయం.

– కేఎస్.అనంతాచార్య, తెలుగు పండితుడు, మంకమ్మతోట, కరీంనగర్



రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వేములవాడకు వీకెండ్ తాకిడి

వేములవాడ: ఎములాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. ఉదయం నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ జయంతి, శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు రాజన్నను దర్శించుకున్నారు. తర్వాత బద్ది పోచమ్మకు బోనం మొక్కు చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవో ప్రతాప రామకృష్ణ, ఇతర అధికారులు పరిశీలించారు.

ప్రభుత్వ విప్ పూజలు

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్ర త్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వే దోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, రాష్ట్ర మహిళా ప్ర.దాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి, నాయకులు కనికరపు రాకేశ్, ధర్మపురి శ్రీనివాస్, సాయి తదితరులున్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

ఎరుకలగూడెంలో వివాహిత బలవన్మరణం

- వేధించిన వ్యక్తితోపాటు అత్తింటివారిపై మృతురాలి తల్లి ఫిర్యాదు

మంథని: మున్సిపల్ పరిధిలోని ఎరుకల గూడెంలో పర్శవేన కల్యాణి(28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క–కొంరయ్యల రెండో కూతురు కల్యాణికి మంథని మండలంలోని ఖానాపూర్‌కు చెందిన పర్శవేన శంకర్‌తో 2013లో వివాహం జరిగింది. వీరు ఐదేళ్లుగా స్థానిక ఎరుకలగూడెంలో నివాసం ఉంటున్నారు. కాగా, కోటపర్తి రవిశ్యామ్ అనే వ్యక్తి కల్యాణికి ఫోన్ ద్వారా పరిచయమయ్యాడు. ఆమెతో ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో ఒకరి జోలికి ఒకరు వెళ్లకుండా పాబందీ రాసుకున్నారు. కానీ, రవిశ్యామ్ గత వారం రోజులు గా ఆమెను మళ్లీ వేధించడంతో పాటు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని కల్యాణి తన భర్త శంకర్, అత్త రాజమ్మకు చెప్పినా వారు పట్టించుకోలేదు. దీంతో ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుంది. తమ కూతురు మృతికి కారణమైన భర్త శంకర్, అత్త రాజమ్మ, కోటపర్తి రవిశ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి సమ్మక్క ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



కల్యాణి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- జమ్మికుంటలోని స్నేహితుడి వద్దకు వచ్చి, వెళ్తుండగా ఘటన
- మృతుడి స్వస్థలం జనగాం జిల్లా గిద్దెబండ తండా

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం గిద్దెబండ తండాకు చెందిన దీరావత్ రాకేశ్(17) తన స్నేహితులు లోతు రామ్‌చరణ్, పసుమతి నిఖిల్‌లతో కలిసి జమ్మికుంటలో ఉండే స్నేహితుడి వద్దకు శుక్రవారం బైక్‌పై వచ్చాడు. వీరిలో రామ్‌చరణ్ ఇక్కడే ఉండగా రాకేశ్, నిఖిల్‌లు అదేరోజు రాత్రి తిరుగుపయనమయ్యారు. రాకేశ్ బైక్‌ను అతివేగంగా నడపడంతో హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారి స్నేహితులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాధితులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా రాకేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి జనహర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



రాకేశ్ (ఫైల్)

కాశీకి వెళ్లొచ్చి.. తనువు చాలించి

- ఉరేసుకున్న వృద్ధుడు
- కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం

కరీంనగర్‌క్రైం: కాశీకి వెళ్లొచ్చాడు.. అదేరోజు రాత్రి ఉరేసుకొని, తనువు చాలించాడు ఓ వృద్ధుడు. ఈ ఘటన కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం నింపింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గణేశ్‌నగర్‌కు చెందిన మాదూరి భూమయ్య అలియాస్ రమేశ్(70) 30 ఏళ్లుగా ఎల్‌ఎండీ కాలనీలో కిరాణా షాపు నడుపుతున్నాడు. 10 రోజుల క్రితం కాశీకి వెళ్లి, శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అలసిపోయానని, నిద్రపోతానని చెప్పి, రాత్రి తన గదిలోకి వెళ్లాడు. శనివారం ఉదయం చూసిన కు టుంబసభ్యులకు ఆయన కనిపించలేదు. ఇంటిపైన రేకుల షెడ్డులో చూడగా ఉరేసుకొని కని పించాడు. కాశీ దర్శనం చేసుకున్నాడని, జీవితం ధన్యమైందని, ఇక బతికింది చాలనుకొని, ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు మృతుడి భార్య వినోద తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న ఆటో

- ఐదుగురికి గాయాలు
- కొండగట్టులో మాల విరమణ చేసి వస్తుండగా ఘటన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రెండు బైక్‌లను ఓ ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యా యి. స్థానికులు, పోలీసు ల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌కు చెందిన చిట్యాల గణేశ్ హనుమాన్ మాల వేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి శనివారం రెండు ద్విచక్రవాహనాలపై కొండగట్టు వెళ్లాడు. మాల విరమణ చేసి, రాత్రి తిరిగి పయనమయ్యారు. తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఎలక్ట్రిక్ గూడ్స్ ఆటో వేగంగా వచ్చి, వీరి వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ రాకేశ్‌తోపాటు గణేశ్, అతని కుటుంబసభ్యులు పూజ, జశ్వంత్, మధులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన టెక్నీషియన్ ప్రవీణ్, పైలట్ నరేశ్‌లు క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సిరిసిల్ల కేసు

సాక్షి, హైదరాబాద్: కాల్ సెంటర్లో ఉద్యోగం పేరుతో బలవంతంగా సైబర్ నేరాలు చేయించేందుకు ప్రయత్నించిన ముఠాపై సిరిసిల్ల పోలీసులు నమోదు చేసిన కేసు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయింది. ఉద్యోగం కోసం కంబోడియాకు వెళ్లిన సిరిసిల్ల యువకుడిని బలవంతంగా సైబర్ నేరాల ముఠాలో చేర్చిన విషయం తెలిసిందే. చైనా దేశస్తుడు సదరు యువకుడికి బలవంతంగా కాల్ సెంటర్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి భారత మొబైల్ నంబర్లకు కొరియర్ సంస్థ పేరిట కాల్స్ చేసి మోసాలు చేయాలని ఒత్తిడి తెచ్చాడు. మూడు నెలల తర్వాత అక్కడి నుంచి తప్పించుకున్న యువకుడు భారత ఎంబసీ అధికారుల సహకారంతో స్వస్థలానికి చేరుకున్నాడు. ఈ మొత్తం వ్యవహారంపై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఆ కేసు దర్యాప్తు నిమిత్తం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ చేసినట్లు ఆ విభాగం డైరెక్టర్ షికా గోయెల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'భాగ్యనగర్'.. మళ్లీ రద్దు

ఓదెల(పెద్దపల్లి): సికింద్రాబాద్ – సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఫాస్ట్ ప్యాసింజర్ రైలును శనివారం నుంచి రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 1, 2, 5, 6, 8, 9వ తేదీల్లో అప్ అండ్ డౌన్.. రెండువైపులా రైలు రాకపోకలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసిఫాబాద్ – రేచిని రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైన్ మరమ్మతుల దృష్ట్యా భాగ్యనగర్ రైలు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

గోశాలలో ఆవులు మృతి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని గోశాలలో శనివారం మూడు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 67 ఆవులు, ఎడ్లను బసంత్‌నగర్ పోలీసులు పట్టుకొని, గోశాలకు తరలించారు. వాటికి టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్షణ కల్పించారు. ఆ జీవాల్లో అస్వస్థకు గురై, అపస్మారక స్థితికి చేరిన పలు ఆవులకు, ఎడ్లకు పశువైద్యులు చికిత్స అందించారు. అయినా, మూడు ఆవులు చనిపోయాయి.

70 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు



నిందుతులు వీరే..

- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం: గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు శనివారం బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కారులో విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దొడ్డి మణికంఠ, మహారాష్ట్ర పబ్బని జిల్లా భీమ్‌నగర్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ సల్మాన్ అన్సారీలు 70 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో ఒడిశా నుంచి మహారాష్ట్రకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. వారు గంజాయి ఎవరి వద్ద కొనుగోలు చేశారు.. ఈ దందా ఎన్ని రోజులుగా కొనసాగిస్తున్నారు.. తదితర అంశాలపై లోతుగా విచారణ చేపడతామన్నారు. నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్, ఎస్సై స్వామి, సిబ్బందిని అభినందించారు.

కొట్టి, డబ్బులు కాజేసిన ఏడుగురి అరెస్టు

జగిత్యాల క్రైం: కారు అద్దె డబ్బులు అడిగిన వ్యక్తిని కొట్టి, అతని అకౌంట్‌లోని రూ.46 వేలను కాజేసిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన నక్క అజయ్ కార్లు అద్దెకిస్తుంటాడు. పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన బొల్లారపు సురేశ్ అతని వద్ద కారు అద్దెకు తీసుకున్నాడు. కానీ, డబ్బులివ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మార్చి 5న అజయ్ సురేశ్‌కు ఫోన్ చేయగా డబ్బులిస్తానని, జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉండమని చెప్పాడు. దీంతో అజయ్ అక్కడికి వెళ్లాడు. నంబర్ లేని కారులో బొల్లారపు సురేశ్, అతని మిత్రులు ఆరెల్లి సునీల్, ఎరెల్లి సాగర్, రాధ నవీన్, తరాల శ్రీకాంత్, ఆరె రాకేశ్, మంత్రి విజయ్‌లు వచ్చి, అతన్ని బలవంతంగా కారులో ఎక్కించుకొని వెళ్లారు. అజయ్‌ని కొట్టి, చంపుతామని బెదిరించడంతోపాటు అతని ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా రూ.46 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. జగిత్యాలలో దింపి, వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం జగిత్యాల బట్టివాడ, పెగడపల్లి మండలం లింగాపూర్‌లో ఆ ఏడుగురిని అరెస్టు చేసి, రూ.8,800 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వెల్గటూర్‌లో దొంగల బీభత్సం

- అర్ధరాత్రి ఐదిళ్లలో, ఒక షాపులో చొరబడిన వైనం
- బంగారం, వెండి, నగదు చోరీ

వెల్గటూర్ (ధర్మపురి): వెల్గటూర్ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరోజు ఐదిళ్లతోపాటు ఒక షాపులో చొరబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటాక దుండగులు తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసి చోరీలు చేశారు. బెస్తవాడకు చెందిన గుమ్ముల నరేశ్ ఇంట్లో చొరబడి, 4 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. అతను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా, భార్య వేసవికాలం కావడంతో పిల్లలను తీసుకొని, పుట్టింటికి వెళ్లింది. అలాగే, జోగం చిలుకలయ్య, ధర్మాజీ లింగన్న, తూపుకారి శివాజీ, మరుపాక విష్ణు ఇళ్లలోనూ చోరీకి ప్రయత్నించారు. శివాజీకి చెందిన బైక్‌ను దొంగిలించేందుకు విఫలయత్నం చేశారు. ఆ వాహనంలో పెట్రోల్ లేకపోవడంతో కొంత దూరంలోని పొలాల్లో పడేసి, వెళ్లిపోయారు. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న శ్రీవేంకటేశ్వర ఆటో మొబైల్ షాపులోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. అందులో ఏమీ దొరక్కపోవడంతో సీసీ టీవీ డీవీఆర్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ పేర్కొన్నారు. పోలీసులు నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. వరుస ఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాళం వేయకుండా ప్రజలెవరూ బయట పడుకోకూడదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



చిందరవందరగా బీరువాలోని దుస్తులు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మంగళ్లపల్లిలో ఆది ఆశయ్య (80) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేయగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఆశయ్య మృతిపై అనుమానాలున్నాయని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును వివరణ కోరగా మృతిపై అనుమానాలను తొలగించేందుకే పోస్టుమార్టం కోసం పంపించామన్నారు. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిరాణ దుకాణానికి రూ.74,947 కరెంట్ బిల్లు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కొండగట్టులో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న చిన్న కిరాణ కొట్టుకు రూ.74,947 కరెంట్ బిల్లు రావడంతో కంగుతిన్నాడు. రమేశ్ అనే వ్యక్తి కొండగట్టులో ఓ గదిని అద్దెకు తీసుకుని కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. మే నెలకు సంబంధించి 168 యూనిట్లే కాలినప్పటికీ రూ.74,947 బిల్లు రావడంతో బెంబేలెత్తిపోయాడు. విద్యుత్ అధికారులను సంప్రదించగా..అంది అంతే అన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



రూ.74,947 వచ్చిన కరెంట్ బిల్లు



సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Jobs @ Hyderabad, (Helpers) 10th Pass / Fail, Age 18-30 yrs Salary Rs. 17000.00* + Bonus Call: 9121497015, 8954 333444 [HA-1122]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800412]

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.